క్లుప్తంగా

24న రాష్ట్ర స్థాయి అబాకస్ పోటీలు

నయీంనగర్ : 11వ రాష్ట్ర స్థాయి అబాకస్ పోటీలు ఈనెల 24న వరంగల్‌లోని సుశీల్ గార్డెన్స్‌లో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శాంతి గురురాజ్ తెలిపారు. మంగళవారం హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ 13 లెవల్స్ లో ఈ పోటీలు జరుగుతాయని, రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. నళిని, ప్రణీత, అజిత, సుధీర్‌కుమార్, జగన్మోహన్, తదితరులు పాల్గొన్నారు.

నోట్‌బుక్స్ పంపిణీ

విద్యారణ్యపురి : కాజీపేట మండలం పోచంపెల్లి జీపీఎస్‌లో లయన్స్‌క్లబ్ ఆఫ్ అభయ బాధ్యులు హరితరాజిరెడ్డి, రమణారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులకు ఉచితంగా నోట్‌బుక్స్, బ్యాగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోని పేద విద్యార్థులకు చేయూతనివ్వాలనే ఉద్దేశ్యంతో నోట్‌బుక్స్, బ్యాగులుపంపిణీ చేస్తున్నామన్నారు. పాఠశాల హెచ్‌ఎం ఉప్పలయ్య,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మేడారం జాతరకు జాతీయ హోదా కల్పించాలి

హన్మకొండ: దేశంలోనే అతిపెద్ద గిరిజన సాంప్రదాయ జాతరైన మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు జాతీయ పండుగ హోదా కల్పించాలని ప్రజావేదిక రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరునహరి శేషు కోరారు. ఈ మేరకు ప్రధాన మంత్రి మోదీకి లేఖ రాసినట్లు తెలిపారు. మంగళవారం హనుమకొండలో ఆయన మాట్లాడుతూ రెండేళ్లకోసారి జరిగే జాతరకు మూడు కోట్ల మంది గిరిజన, గిరిజనేతర భక్తులు తరలివచ్చే అతిపెద్ద జాతర అన్నారు. అనేక సంవత్సరాలుగా రాష్ట్ర ప్రభుత్వం, ప్రజలు, ఆదివాసీ గిరిజనులు జాతరను జాతీయ పండుగగా గుర్తించాలని విజ్ఞప్తి చేసినా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. కార్యక్రమంలో నరేందర్, రాంబాబు, సతీష్ పాల్గొన్నారు.

గతంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదు

మడికొండ: గత ప్రభుత్వంలో మడికొండ-రాంపూర్ పరిధిలోని ఇండస్ట్రీయల్‌లో ఎలాంటి అభివృద్ధి పనులు జరగలేదని రాష్ట్ర గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి మాలోతు శంకర్ అన్నారు. కొత్త ప్రభుత్వంలోనైనా అభివృద్ధి పనులను చేసి స్థానిక యువతకు ఉపాధి అవకాశాలను కల్పించాలని అన్నారు. అలాగే మడికొండలో ప్రధాన సమస్య డంపింగ్ యార్డును తొలగిస్తే టెక్స్‌టైల్ పార్క్‌లో యువతకు ఉపాధి అవకాశాలు దొరుకుతాయి.

మంత్రిని కలిసిన ఏఎన్ఎంలు



హన్మకొండ: తమను రెగ్యులరైజ్ చేయాలని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2003లో డిస్ట్రిక్ట్ సెలక్షన్ కమిటీ ద్వారా ఎంపికైన యూరోపియన్ ఏఎన్ఎంలు కోరారు. మంగళవారం హైదరాబాద్‌లో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహాను ఏఎన్ఎంలు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. స్పందించిన మంత్రి సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారని ఏఎన్ఎంలు తెలిపారు.

జాతీయ ఎన్ఎస్ఎస్ శిబిరానికి కిట్స్ విద్యార్థిని

హసన్‌పర్తి: జాతీయ ఎన్ఎస్ఎస్ శిక్షణ శిబిరానికి కిట్స్‌లో బీటెక్ ఫైనలియర్ చదువుతున్న విద్యార్థిని ఎ.కావేరి ఎంపికైంది. ఈనెల 23 నుంచి వచ్చే ఏడాది జనవరి 1వ వరకు హిమాచల్ ప్రదేశ్‌లోని అటల్ బీహారి వాజ్‌పాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మౌంటెనిరింగ్ అండ్ అలైడ్ స్పోర్ట్స్ (ఎబీవీఐఎంఎఎస్)లో జరగనున్న శిబిరంలో కావేరి పాల్గొననున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్‌రెడ్డి తెలిపారు. మంగళవారం కళాశాలలో జరిగిన సమావేశంలో కావేరికి ఎంపిక పత్రాన్ని అందించారు.

టీఎస్ ఈఈయూ మీడియా ఇన్‌చార్జ్‌గా సతీష్ కుమార్

హన్మకొండ: తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (టీఎస్‌ఈఈయూ)-327 టీఎస్ ఎన్పీడీసీఎల్ శాఖ మీడియా ఇన్‌చార్జ్‌గా సీహెచ్.సతీష్ కుమార్‌ను నియమించారు. మంగళవారం హనుమకొండలోని టీఎస్ ఈఈయూ-327 కార్యాలయంలో ఆ యూనియన్ రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఇనుగాల శ్రీధర్ ఎన్పీడీసీఎల్ కాజీపేట ఈఆర్‌ఓలో ఆర్టిజన్ గ్రేడ్-2గా పనిచేస్తున్న సతీష్ కుమార్‌కు నియామక ఉత్తర్వులు అందించారు.

ముగిసిన పూజలు

కాజీపేట : స్థానిక శ్వేతార్కమూలగణపతి దేవాలయంలో మంగళవారం నాగదండం పూజలను భక్తులు ఘనంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు ఐనవోలు వెంకటేశ్వర్లు శర్మ ఆధ్వర్యంలో పండితులు నాగదండంకు పూజలు చేశారు. ఇటీవల కాశీయాత్రకు వెళ్లి వచ్చిన భక్తులు గంగానది నుంచి తెచ్చిన జలాలతో శ్వేతార్కుడికి అభిషేకాలు చేశారు.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచండి

● వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

నయీంనగర్ : పలు పథకాల కింద కొనసాగుతున్న అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం నగరంలోని కుడా కార్యాలయ మీటింగ్ హాల్‌లో జీడబ్ల్యూఎంసీ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషాతో కలిసి వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో కుడా, మున్సిపల్, స్మార్ట్ సిటీ అభివృద్ధి పథకాల పై మున్సిపల్, కుడా, రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారులతో ఎమ్మెల్యే నాయిని సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన నియోజకవర్గంలో వివిధ పథకాల కింద కొనసాగుతున్న, చేపట్టబోయే అభివృద్ధి పనులను సమీక్షించి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో కుడా పీఓ అజిత్‌రెడ్డి, ఈఈ భీంరావు, కుడా సెక్రటరీ మురళీధర్‌రావు, ఎస్ఈలు పాల్గొన్నారు.

రేషన్ డీలర్లకు గౌరవ వేతనం ఇప్పించండి

రేషన్ డీలర్లకు గౌరవ వేతనం త్వరగా ఇప్పించేలా సహకరించాలని తెలంగాణ రాష్ట్ర రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు బత్తుల రమేష్‌బాబు ఆధ్వర్యంలో నాయకులు ఎమ్మెల్యే నాయినిని కోరారు. మంగళవారం ఎమ్మెల్యే నివాసంలో రేషన్ డీలర్ల నాయకులు ఎమ్మెల్యేను కలిసి గజమాలతో సత్కరించారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నాయకుడు

బీఆర్ఎస్‌కు సీనియర్ నాయకుడు, మాజీ కార్పొరేటర్ వేల్పుల మోహన్‌రావు కాంగ్రెస్ పార్టీలో చేరాడు. మంగళవారం ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. చేరిన వారిలో వాసం శ్రీధర్, అభిలాష్, వేల్పుల పున్నం చందర్ ఉన్నారు.

యేసు చూపిన మార్గంలో నడవాలి



కాజీపేట : ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న గంగపుత్ర సంఘం నాయకులు

కాజీపేట: సమాజ శ్రేయస్సును కాంక్షిస్తూ లోకరక్షకుడిగా ఈ భూవిపై జన్మించిన యేసుప్రభువు చూపిన మార్గంలో అందరం నడిచినప్పుడే ఆదర్శవంత సమాజ నిర్మాణం జరుగుతుందని ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి అన్నారు. 61వ డివిజన్ కార్మెల్ బాప్టిస్టు చర్చిలో మంగళవారం మినీ క్రిస్మస్ వేడుకలను ప్రారంభించి శుభాకాంక్షలు తెలిపారు.

గంగపుత్రుల వినతి

కాజీపేట: గంగపుత్ర కులస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని కోరుతూ వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యేకు సంఘం జిల్లా నాయకులు వినతిపత్రం అందజేశారు. సంఘం కార్యదర్శి కొమురయ్య, కె.వేదప్రకాష్, రాజారాం, సాంబమూర్తి, శంకర్ తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యే కలిసిన పలు కాలనీ వాసులు

హన్మకొండ: వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డిని హనుమకొండలోని గాంధీనగర్, టీవీ టవర్ కాలనీ అభివృద్ధి కమిటీ బాధ్యులు కలిశారు. మంగళవారం హనుమకొండలోని నూతన ఆర్ అండ్ బీ అతిథి గృహంలో గాంధీనగర్ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు చెరుకు వెంకట రాజిరెడ్డి, టీవీ టవర్ కాలనీ అధ్యక్షుడు సమ్మిరెడ్డి, సభ్యులు కలిసి



హన్మకొండ: ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ఆయా కాలనీల అభివృద్ధి కమిటీ బాధ్యులు

పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలి పారు.

డబుల్‌బెడ్ రూం ఇళ్లు పంపిణీ చేయాలి

పేదల కోసం నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లను వెంటనే పంపిణీ చేయాలని అంబేద్కర్‌నగర్ బస్తీ కమిటీ అధ్యక్షుడు ఎర్ర చంద్రమౌళి కోరారు. మంగళవారం హనుమకొండలోని ఆర్ అండ్ బీ నూతన అతిథి గృహంలో ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డిని బస్తీ వాసులు కలిశారు. బాలసముద్రంలోని సర్వే నెంబర్ 1066లో అంబేద్కర్ నగర్, జితేందర్‌సింగ్ నగర్ గుడిసెవాసుల కోసం డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించి ఏళ్లు గుడుస్తున్నా గత ప్రభుత్వం గుడిసెవాసులకు కేటాయించలేదన్నారు. గుడిసెవాసులకు ఇళ్లు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించారు.

దళారి చిత్రాన్ని వీక్షించిన ఎమ్మెల్యే

హన్మకొండ అర్బన్ : రాజీవ్ కనకాల, శకలక శంకర్, శ్రీతేజ్, అక్సా ఖాన్, రూపిక ప్రధాన పాత్రల్లో దర్శకుడు కాచిడి గోపాల్‌రెడ్డి రూపొందించిన దళారి చిత్రాన్ని నగరంలోని ఏషియన్ శ్రీదేవి మాల్‌లో మంగళవారం ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి వీక్షించారు. దర్శకుడు గోపాల్‌రెడ్డి, టీపీసీసీ కార్యదర్శి ఈ.వీ శ్రీనివాస్‌రావు, కార్పొరేటర్లు వెంకటేశ్వర్లు, శ్రీమాన్, లక్ష్మారెడ్డి, చిత్రాన్ని తిలకించారు.

మహాలక్ష్మి పథకాన్ని సవరించాలి

హన్మకొండ అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణాన్ని కల్పిస్తూ ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకాన్ని సవరించాలని ధర్మ సమాజ్ పార్టీ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా అదనపు కలెక్టర్ మహేందర్‌జీని కలిసి వినతిపత్రం అందజేశారు. ఉచిత ప్రయాణంలో చాలా అనర్థాలు, నష్టాలు ఉన్నాయని, తెల్లరేషన్ కార్డు ఉన్న మహిళలకు మాత్రమే ఉచితం కల్పించాలని, ఉద్యోగులకు కూడా ఉచిత ప్రయాణాన్ని వర్తింప చేయడం ఎంతవరకు సమంజసమని అన్నారు. ఉచిత ప్రయాణం ప్రభావం ఆటో కార్మికుల పై పడుతుందని, వారు తీవ్ర నష్టానికి గురవుతున్నారన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ సుమన్, రాష్ట్ర



అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న డీఎస్పీ నాయకులు

కార్యదర్శులు, నాయకులు సాయిబాబా, రాజు, రాష్ట్ర పరిరక్షణ కమిటీ కోఆర్డినేటర్ రత్నాకర్, ఉమ్మడి వరంగల్ జిల్లా స్టూడెంట్ వింగ్ ఇన్‌చార్జ్, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై కొరడా

కాజీపేట అర్బన్ : అక్రమ నిర్మాణాలపై హన్మకొండ తహసీల్ , బల్దియా, డీఆర్ఎఫ్, సుబేదారి పోలీస్ సిబ్బంది కొరడా ఝళిపించి అక్రమ నిర్మాణాలను కూల్చివేసిన సంఘటన మంగళవారం 31వ డివిజన్ పరిధిలోని న్యూశాయంపేటలో చోటు చేసుకుంది. హన్మకొండ తహసీల్దార్ విజయ్‌కుమార్, బల్దియా, సుబేదారి పోలీసుల కథనం ప్రకారం.. 31వ డివిజన్ పరిధిలోని హన్మకొండ తహసీల్ జాగీరుకు చెందిన సర్వేనెంబర్ 964 ప్రభుత్వ భూమిలోని గుట్టను సుందీకరణలో భాగంగా కుడాకు అప్పగించారు. 20 ఏళ్లుగా గుట్ట వద్ద బండ కొట్టుకుంటూ జీవనం కొనసాగిస్తున్న వడ్డెర కుటుంబీకులు ఇటీవల మూడు రేకులతో కూడిన ఇళ్లను నిర్మించుకున్నారు. ప్రభుత్వ భూమిని ఆక్రమించి అక్రమ నిర్మాణాలను చేపట్టినందుకు డీఆర్ఎఫ్ సిబ్బంది జేసీబీలతో నిర్మాణాలను కూల్చివేసినట్లు



అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న డీఆర్ఎఫ్ సిబ్బంది

తెలిపారు. ప్రభుత్వ భూములను ఆక్రమించి అక్రమ నిర్మాణాలను చేపడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాగా 20 ఏండ్లుగా ఇక్కడే బండ కొట్టుకుంటు జీవనం కొనసాగిస్తున్నామని, తమకు నివాస గృహాలను అందజేయాలని వాపోయారు.

అంధుల సమస్యలు పరిష్కరించండి

నయీంనగర్ : బ్యాక్‌లాగ్ ఉద్యోగాలను భర్తీ చేసి అంధుల సమస్యను పరిష్కరించాలని తెలంగాణ అంధుల నిరుద్యోగ సంఘం అధ్యక్షుడు ఎస్.మహేందర్, ప్రధాన కార్యదర్శి జి.వీరన్న ప్రభుత్వాన్ని వేడుకున్నారు. మంగళవారం హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ అంధులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో రిజర్వేషన్ కల్పించాలన్నారు.

మహాజన సోషలిస్ట్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా సురేందర్

హన్మకొండ: మహాజన సోషలిస్టు పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడిగా బండారి సురేందర్ మాదిగను నియమించారు. మంగళవారం నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో ఎమ్మార్పీఎస్, మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సురేందర్ మాట్లాడుతూ తన పై ఎంతో నమ్మకంతో జిల్లా అధ్యక్షునిగా నియమించిన మంద కృష్ణ మాదిగకు, సహకరించిన నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో మహాజన సోషలిస్టు పార్టీని బలోపేతం చేస్తానన్నారు.

పరామర్శ

కాశిబుగ్గ : గ్రేటర్ వరంగల్ 18వ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు బొడ్డు రాకేష్ తండ్రి భిక్షపతి సోమవారం గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు మంగళవారం రాకేష్ నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఆయన వెంట డివిజన్ బీజేపీ నాయకులు ఉన్నారు.

కక్ష సాధింపు చర్యలు ఉండవు

● వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు

హన్మకొండ: తాను ఎలాంటి కక్ష సాధింపు చర్యలకు పాల్పడనని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు స్పష్టం చేశారు. మంగళవారం హనుమకొండలోని అంబేడ్కర్ భవన్‌లో నియోజకవర్గంలోని లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరించి, నిర్బంధాలు కొనసాగించిందన్నారు. కాంగ్రెస్ పాలనలో ఇలాంటివి ఉండవన్నారు. బీఆర్ఎస్ నాయకులు ఇంకా అధికారంలో ఉన్నట్లు కనీస జ్ఞానం లేకుండా వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. గ్రామ అభివృద్ధి కమిటీల ద్వారా సంక్షేమ పథకాల లబ్ధిదారులను ఎంపిక చేస్తామన్నారు. బ్రోకర్లకు తావు లేదన్నారు. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం వెనుక అనేక ప్రయోజనాలున్నాయన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు గురుమూర్తి శివకుమార్, జలగం అనిత, తహసీల్దార్లు, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్లు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

కేయూలోని సమస్యలు పరిష్కరించాలి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని వివిధ సమస్యలను పరిష్కరించాలని కేయూ ఆల్‌మాల స్టూడెంట్స్ అసోసియేషన్ బాధ్యులు మంగళవారం హనుమకొండలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజును కలిసి విన్నవించారు. ఇటీవలనే ఎమ్మెల్యేగా ఎన్నికైన నాగరాజును అసోసియేషన్ బాధ్యులు మర్యాదపూర్వకంగా కలిసి దుశ్శాలువాతో



హన్మకొండ: కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు

సన్మానించి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కేయూ ఆల్‌మాల స్టూడెంట్స్‌అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్లు, ప్రొఫెసర్లు వరలక్ష్మి, సమ్మయ్య, కరుణాకర్, సదాశివ, అజయ్, జగన్, రవీందర్, సంపత్, సురేష్, చందు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన గ్రామస్తులు

మడికొండ: వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజును మంగళవారం హనుమకొండ సుబేదారిలోని తన నివాసంలో మడికొండకు చెందిన బుర్ర శ్రీధర్, కాంగ్రెస్ కాజీపేట మండల అధ్యక్షుడు తొట్ల రాజుయాదవ్, శంకర్, నాగరాజు, గోపి, నవీన్ యాదవ్, చంద్రమౌళి, రా జేందర్, రాజ్‌కుమార్, మానుపాటి రాజు, స్థానిక నాయకులు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువతో సన్మానించారు. గత ప్రభుత్వం గ్రామంలో అభివృద్ధి పనులను విస్మరించిదని, మన ప్రభుత్వంలో పనులను పూర్తి చేయాలని కోరారు.

అభివృద్ధి పనులపై దృష్టి సారించండి

వరంగల్ అర్బన్ : డివిజన్లలో అభివృద్ధి పనులు పూర్తిగా స్తంభించిపోయాయని, యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని గ్రేటర్ వరంగల్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషాకు కార్పొరేటర్లు విజ్ఞప్తి చేశారు. మంగళవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో కమిషనర్‌ను తూర్పు నియోజకవర్గానికి చెందిన పలువురు కార్పొరేటర్లు కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. అసెంబ్లీ ఎన్నికల కోడ్ కారణంగా పనులు నిలిచిపోయాయన్నారు. ఎన్నికలు పూర్తయి పక్షం రోజులు గడిచినా పనులు మొదలు కాలేదని పేర్కొన్నారు. స్మార్ట్‌సిటీ, సీఎం, జనరల్ ఫండ్, సీడీఎఫ్ తదితర నిధులకు మంజూరైన పనులను, టెండర్లు పూర్తయిన పనులకు అగ్రిమెంట్లు చేయాలని



బల్దియా కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న కార్పొరేటర్లు

కోరారు. కమిషనర్‌ను కలిసిన కార్పొరేటర్లు మరుపల్లి రవి, దిడ్డి కుమారస్వామి, స్వర్ణలత, కవిత. పద్మ, అరుణ, కుమార్ తదితరులు ఉన్నారు.

రిటైర్డ్ ఉద్యోగులకు బెనిఫిట్స్ చెల్లించాలి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని రిటైర్డ్ నాన్‌టీచింగ్ ఉద్యోగ సంఘం బాధ్యులు మంగళవారం వీసీ రమేష్‌ను కలిసి పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ప్రధానంగా పీఆర్‌సీకి సంబంధించిన ఇన్‌స్టాల్‌మెంట్స్ చెల్లించాలని, డీఏ ఏరియర్స్‌ను ఇవ్వాలని, గ్రాట్యూటీ డిఫరెన్స్ అమౌంట్ కొందరి ఉద్యోగులకు చెల్లించాల్సిన వాటిని వెంటనే చెల్లించాలని వీసీకి విన్నవించారు. అలాగే ఈనెల 20న కేయూలోని కామర్స్‌అండ్ బిజినెస్‌మేనేజ్‌మెంట్ కళాశాల సెమినార్‌లో నాన్‌టీచింగ్ ఉద్యోగుల సర్వసభ్యసమావేశంను నిర్వహిస్తున్నామన్నారు. వీసీని కలిసిన వారిలో ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ ఎస్.సంజీవరావు, డాక్టర్ ఎ.నాగేశ్వర్‌రావు, బాధ్యులు జి చంద్రమౌళి,



వీసీకి వినతిపత్రంను ఇస్తున్న రిటైర్డ్ నాన్‌టీచింగ్ ఉద్యోగుల సంఘం బాధ్యులు

ఎస్ఎస్ఆర్ మూర్తి, లక్ష్మారెడ్డి, ఎండీ.అమీన్, నరసింహామూర్తి, అక్తర్ ఉన్నారు. రిటైర్డ్ ఉద్యోగులు కలిసిన సమయంలో అక్కడే రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రావు, కేయూ ఫైనాన్స్ ఆఫీసర్ తోట రాజయ్య ఉన్నారు.

విద్యార్థుల్లో సామర్థ్యాలు పెంపుదల చేయాలి

విద్యారణ్యపురి: విద్యార్థుల్లో సామర్థ్యాలు పెంపుదల చేయాలని తొలిమెట్టు, ఉన్నతి ప్రోగ్రాం హనుమకొండ మండల నోడల్ అధికారి కె.రమేష్‌బాబు అన్నారు. మంగళవారం హనుమకొండలోని పెట్రోల్‌పంపు ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించి ఉపాధ్యాయుల విద్యాబోధన, అభ్యసన ప్రక్రియను పరిశీలించారు. ఉన్నత పాఠశాలల్లో ఉన్నతి కార్యక్రమాన్ని తప్పనిసరిగా అమలుచేయాలని ఉపాధ్యాయులను కోరారు. అదే ఉన్నత పాఠశాల స్కూల్ కాంప్లెక్స్‌పరిధిలో ఉన్న కొత్తూరు ఉర్దూ మీడియం ప్రాథమిక పాఠశాలను కూడా సందర్శించారు. ఆయన వెంట హెచ్‌ఎం పద్మావతి, రిసోర్స్‌పర్సన్ టి.భాస్కర్, టీఎస్‌పీటీఏ జిల్లా జనరల్ సెక్రటరీ జిలుకర ఏకాంతం ఉన్నారు.

సంక్షిప్త సమాచారం

టీఎస్ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డికి శుభాకాంక్షలు

హన్మకొండ: టీఎస్ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్‌రెడ్డిని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి,ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (టీఎస్ ఈఈయూ)-327 నాయకుడు శ్రీధర్ కలిశారు. మంగళవారం హనుమకొండలోని టీఎస్ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో సీఎండీని వారు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఇద్దరు పలు అంశాలపై చర్చించారు.

ఘనంగా పెన్షనర్స్ డే వేడుకలు

కాశిబుగ్గ : గ్రేటర్ వరంగల్ 35వ డివిజన్ ఏసిరెడ్డినగర్‌లో మంగళవారం పెన్షనర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేడుకలకు ముఖ్య అతిథులుగా వరంగల్ డీటీఓ విజయ సారథి, ఎస్‌టీఓ సునీత హాజరయ్యారు. పెన్షనర్స్ ఎదుర్కొంటున్న సమస్యలపై సమావేశం నిర్వహించుకున్నారు. అతిథులను సన్మానించారు.

పైడిపల్లిలో క్రిస్మస్ వేడుకలు

దేశాయిపేట: గ్రేటర్ వరంగల్ 3వ డివిజన్ పైడిపల్లిలోని గేస్తమనే ప్రార్థన మందిరంలో వర్ధన్నపేట నియోజకర్గ పాస్టర్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్ పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రిస్మస్ వేడుకలను నియోజకవర్గ స్థాయిలో నిర్వహించడం అభినందనీయమని అన్నారు.

హసన్‌పర్తికి చేరిన అక్షింతలు

హసన్‌పర్తి: అయోధ్య శ్రీరాముల వారి మందిరం పూజిత అక్షింతలు మంగళవారం తెల్లవారుజామున హసన్‌పర్తికి చేరాయి. రామ మందిరం నుంచి పురోహితులు వేద మంత్రోచ్ఛరణలతో పూజించిన పూజిత అక్షింతలు ప్రతి ఇంటికి చేరేలా హిందూ వాహిని, భజరంగదళ్ తదితర ఆధ్యాత్మిక ధార్మిక సంస్థల ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా ప్రతి గ్రామానికి చేర్చారు.

నేడు రైల్వే థర్డ్‌లైన్ తనిఖీ

కాజీపేట రూరల్ : వరంగల్-చింతల్ రైల్వే స్టేషన్ల మధ్య బుధవారం మూడో రైల్వే లైన్ నిర్మాణ పనులను కమిషనర్ ఆఫ్ రైల్వే సేఫ్టీ తనిఖీ చేయనున్నట్లు మంగళవారం రైల్వే అధికారులు తెలిపారు. బల్లార్షా-విజయవాడ సెక్షన్‌లో వరంగల్-చింతల్‌పల్లి మధ్య 10 కిలోమీటర్ల దూరం వరకు సుమారు రెండేళ్ల నుంచి చేపడుతున్న మూడో రైల్వే లైన్ నిర్మాణం ఎట్టకేలకు పూర్తయిందని తెలిపారు. ట్రాఫిక్‌కు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. పూర్తి అయిన లైన్ ట్రాక్ స్పీడ్ టెస్ట్, ట్రయల్ రన్ టెస్ట్ చేసిన తర్వాత కమిషనర్ ఆఫ్ రైల్వే సేఫ్టీ ట్రాక్‌క్లియర్ సర్టిఫికెట్ ఇచ్చిన తర్వాత రవాణా ఉంటుందని తెలిపారు.

ఫాసిజాన్ని ఓడించాలి

హసన్‌పర్తి: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఫాసిస్టు బీజేపీ ప్రభుత్వాన్ని ఓడించాలని సీపీఐ(ఎంఎల్) కేంద్రకమిటీ సభ్యుడు నైనాలశెట్టి మూర్తి పిలుపునిచ్చారు. మండలంలోని చింతగట్టు క్యాంప్ సమీపంలో సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి వినోద్‌మిశ్రా వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై వినోద్ మిశ్రా చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మత్మోనాద పాలకుల నుంచి దేశాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు.

ఎన్ఎస్ఎస్ వలంటీర్ల శ్రమదానం

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని ఇంజనీరింగ్ కళాశాల (కో ఎడ్యూకేషన్) జాతీయ సేవాపథకం (ఎన్ఎస్ఎస్) వలంటీర్లు మంగళవారం క్యాంపస్‌లోని ఆడిటోరియం వద్ద పరిసరప్రాంతంలో శ్రమదానం చేశారు. ఈనెల 28 నుంచి 30 వరకు ఆడిటోరియంలో ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ సెషన్స్‌ను యూనివర్సిటీ నిర్వహించబోతుంది. దీంతో ఆడిటోరియం పరిసర ప్రాంతంలో క్లీన్ అండ్ గ్రీన్ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మల్లారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు సామాజిక సేవాదృక్పథంను అలవర్చుకోవాలన్నారు.

రాష్ట్రస్థాయి కిక్ బాక్సింగ్‌కు ఆర్బిట్ విద్యార్థులు

హసన్‌పర్తి: రాష్ట్రస్థాయి కిక్ బాక్సింగ్ పోటీలకు ఎల్లాపురంలోని ఆర్బిట్ ఈ-టెక్నో స్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. నగరంలోని జేఎన్ఎస్ మైదానంలో సోమవారం జరిగిన 67వ జిల్లాస్థాయి ఎస్‌జీఎఫ్ఐ పోటీల్లో పాఠశాలకు చెందిన పి.ఆదిత్య, కె.అఖిల్, కె.సాత్విక్‌లు పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు స్కూల్ కరస్పాండెంట్ చిట్టిరెడ్డి భగవాన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం పాఠశాలలో విద్యార్థులను అభినందించారు.

ఖోఖోలో రాష్ట్ర స్థాయికి బొల్లికుంట విద్యార్థిని

మామునూరు: ఈనెల 20 నుంచి 23 వరకు అసిఫాబాద్ క్రీడామైదానంలో జరగనున్న ఖోఖో రాష్ట్ర స్థాయి పోటీలకు వరంగల్ ఉమ్మడి జిల్లా నుంచి బొల్లికుంట ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 7వ తరగతి విద్యార్థిని బొజ్జం అక్షయ ఎంపికైంది. మంగళవారం పాఠశాలలో అక్షయకు హెచ్‌ఎం పిండి ఆనందబాబు, తదితరులు మెమెంటోను అందజేసి అభినందించారు.

ఇద్దరిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

వరంగల్ క్రైం: హనుమకొండ పోలీస్‌స్టేషన్‌లో ఇద్దరిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు హనుమకొండ సీఐ కరుణాకర్ తెలిపారు. ములుగు జిల్లా వెంకటాపూర్‌కు చెందిన భూక్య ఉమాదేవి 2019లో పెద్దమ్మగడ్డ శివారులో పిన్నింటి సంపత్‌రావు నుంచి 200 గజాల భూమిని కొనుగోలు చేసి మున్సిపాలిటి అనుమతి తీసుకుంది. ఇంటి నిర్మాణం పనులు ప్రారంభించగా గాజుల విజయ, బొంకురి అశోక్‌లు ఇంటి పనులు జరుగకుండా అడ్డుకొని, ప్లాటు వద్దకు వస్తే చంపేస్తామని, కులం పేరుతో దూషించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. దీంతో ఇద్దరిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

స్పీడ్ బ్రేకర్స్ ఏర్పాటు చేస్తాం

ఖిలా వరంగల్: ఆర్ అండ్ బీ అధికారులతో మాట్లాడి వరంగల్-ఖమ్మం రహదా రిపై శంభునిపేట నాగమయ్య కమాన్ వద్ద స్పీడ్ బ్రేకర్లు, ప్రమాద హెచ్చరిక బోర్డును ఏ ర్పాటు చేస్తామని వరంగల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకన్న తెలిపారు. తరుచూ వాహన ప్రమాదాలు సంభవిస్తున్న నేపథ్యంలో మంగళవారం ఆయన ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినా వాహనచోదకులు ఓవర్ స్పీడ్ డ్రైవ్ వల్లనే ప్రమాదాల సంభవిస్తున్నాయని చెప్పారు. ప్రతి వాహనదారుడు హెల్మెట్, సీటుబెల్ట్ ధరించాలని సూచించారు.

పోగొట్టుకున్న మొబైల్ అప్పగింత

రామన్నపేట : మట్టెవాడ పోలీస్‌స్టేషన్ పరిదిలో నివాసముంటున్న మహ్మద్ ఫర్ మహిళ గత నెల మొబైల్ పోగొట్టుకోగా సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ట్రేస్ చేసి బాధితురాలికి అప్పగించినట్లు సెంట్రల్ జోన్ డీసీపీ బారి తెలిపారు. మంగళవారం మట్టెవాడ పోలీస్‌స్టేషన్‌లో పోలీసు పనితీరును పరిశీలించిన ఆయన బాధితురాలికి మొబైల్ అప్పగించారు. 52 మొబైల్స్‌ను పోగొట్టుకున్న బాధితులకు అప్పగించినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఉద్యోగికి గాయాలు

కాజీపేట: కాజీపేట చౌరస్తా సమీపంలో సైకిల్‌పై వెళ్తున్న రైల్వే ఉద్యోగిని మంగళవారం ఓ ద్విచక్రవాహనం అతి వేగంగా వచ్చి ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. విధి నిర్వహణ కోసం సైకిల్‌పై వెళ్తున్న ఎండీ.రహీమ్‌ను ద్విచక్ర వాహనం అదుపు తప్పి ఢీకొనడంతో తీవ్రగాయమైంది. కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

గీత కార్మికుడి గాయాలు

హసన్‌పర్తి: తాటిచెట్టుపై నుంచి పడి ఓ గీత కార్మికుడికి గాయాలైన సంఘటన మండలంలోని ముచ్చర్లలో మంగళవారం జరిగింది. గ్రామానికి చెందిన చిర్ర శేషాచలం కల్లు గీయడానికి చెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు కిందపడగా బలమైన గాయాలయ్యాయి. ఆస్పత్రికి తరలించారు.

ఓటరు జాబితా పకడ్బందీగా రూపొందించాలి

వరంగల్ : భారత ఎన్నికల కమిషన్ ఆదేశానుసారం స్పెషల్ సమ్మరీ రివిజన్ ముసాయిదా ప్రకారం ఓటర్ల జాబితాను పకడ్బందీగా రూపొందించాలని కలెక్టర్ పి.ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో స్పెషల్ సమ్మరీ రివిజన్-2024 ఓటరు నమోదుపై జిల్లాలోని నర్సంపేట, వరంగల్ తూర్పు, వర్ధన్నపేట నియోజకవర్గాల ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డిసెంబర్ 20 నుంచి 5 జనవరి 2024 వరకు ప్రీ రివిజన్ యాక్టివిటీస్ చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. జనవరి 6న డ్రాఫ్ట్ పబ్లికేషన్, జనవరి 6 నుంచి 22 వరకు అభ్యంతరాల స్వీకరణ ఉంటుందని పేర్కొన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, మున్సిపల్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా, వరంగల్ ఆర్డీఓ వాసుచంద్ర, నర్సంపేట ఆర్డీఓ కృష్ణవేణి, ఎలక్షన్ సూపరింటెండెంట్ విశ్వనారాయణ, తహసీల్దార్లు పాల్గొన్నారు.

'రూర్బన్' పనులను పూర్తిచేయాలి

రూర్బన్ స్కీం ద్వారా చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని వరంగల్ కలెక్టర్ పి.ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. కలెక్టర్ చాంబర్‌లో రూర్బన్ పథకం కింద చేపట్టిన వివిధ రకాల అభివృద్ధి పనుల పురోగతిపై సంబంధిత శాఖల అధికారులతో మంగళవారం సమీక్షించారు. సమావేశంలో డీఆర్‌డీఓ సంపత్‌రావు, జిల్లా వ్యవసాయ అధికారి ఉషాదయాళ్, జిల్లా వైద్యశాఖ అధికారి ఉషాదయాళ్, ఈఈలు రాజు, కుమార్, ఇజ్జగిరి, డీహెచ్‌ఓ శ్రీనివాసరావు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సమస్యలపై పోరాటాన్ని కొనసాగించాలి

హసన్‌పర్తి: అధికారంలో లేనప్పటికీ ప్రజాసమస్యలపై పోరాటాన్ని కొనసాగించాలని మాజీ ఎమ్మెల్యే అ రూరి రమేశ్ పిలుపునిచ్చారు. హనుమకొండ హంటర్ రోడ్‌లో పార్టీ కార్యాలయంలో బీఆర్ఎస్ పార్టీ 1వ డివిజన్ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం మంగళవారం జరిగింది. సమావేశానికి అరూరి హాజరై మాట్లాడుతూ ఎన్నికల్లో గెలుపోటములు సహజమన్నారు. అయితే కార్యకర్తలు మాత్రం అధైర్యపడొద్దన్నారు. కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానన్నారు. పదవి లేకపోయినప్పటికీ నియోజకవర్గ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు నరెడ్ల శ్రీధర్, పీఏసీఎస్ చైర్మన్ గోపాల్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.